"అదేవిటోయ్ రాఘవరావ్, అలా ఉన్నావేం?"

విశ్వం పలకరింపు విని తలెత్తి చూశాడు రాఘవరావు.

టేబుల్ ముందు రాఘవరావు కూర్చున్నాడంటే ఫైళ్ళు చక చకా కదిలిపోతుంటాయి. నోట్లు పుటప్ అవుతుంటాయి. కొర్రీలకు క్షణాల మీద రిప్లైనోతయారవుతాయి.

కాని ఇవ్వాళ రాఘవరావు మన సేం బాగాలేనట్లుంది. మంగమ్మ లాంటి స్త్రీలకు భర్త లైన వారి మనను అప్పుడప్పుడు బాగుండకపోవడంలో వింతేం లేదు!

ఆ రోజు రాఘవరావు టేబుల్ మీది ఒక్క ఫైలూ ముందుకు కదల లేదు. అలవాటుగా టేబుల్ మీది దుమ్ము కుర్చీ దుమ్ము దులుపుకోకుండా అలాగే కూర్చున్నాడు. అల్మేరాకు తాళం చెవుల గుత్తి వేలాడుతూ లేదు. అంటే ఇంకా అల్మేరా కూడా తెరవ లేదు.

ఎదురుగా రంగు వెలసిన గోడ. ఎప్పుడూ చూసే గోడే. అప్పుడే కనిపిస్తున్నట్టు తదేకంగా ఆ గోడనే చూస్తూ కూర్చున్నాడు రాఘవ.


"ఒంట్లో బాగా లేదా రాఘవా?"

"ఉహుఁ - బాగానే ఉంది."

అంటే బాధ మానసికం అని తెలుస్తూనే ఉంది.

"ఊరి నుంచి కబు రేదైనా వచ్చిందా?" ఊళ్ళో ఉన్న తన తండ్రికి ఆరోగ్యం సరిగా లేదని ఇదివరకోసారి చెప్పాడు.

"పద - అలా కాంటిన్‌కు వెళ్తూ మాట్లాడుకుందాం..." కుర్చీలోంచి లేచాడు రాఘవరావు.




ఎప్పటిలా ఫైళ్ళు సర్దే అవసరం లేకపోయింది. నిన్న కట్టిన కట్టలు ఎక్కడివి అక్కడ అలాగే ఉన్నాయి.

రాఘవరావు తీవ్ర మనస్తాపంలో ఉన్నాడు.

"ఇంట్లో గొడవ జరిగిందోయ్..." గేటు దాటి కాంటీన్ వైపు నడుస్తూ అన్నాడు రాఘవరావు.

"అరెరె!..."

"నువ్వు ఎప్పుడు వస్తావా, చెబుదామనే అనుకుంటున్నా - మనసులోని బాధను ఆప్తమిత్రునికి చెప్పుకోవడంలో అంతులేని సౌఖ్యం ఉంది విశ్వం."

ఆ మాట లంటున్నప్పుడు రాఘవ గొంతులోని జీరను గమనించాడు విశ్వం.

"మా నాన్నను చూడటానికి రేపు ఊరికి వెళ్తాను అన్నాను."

"ఊఁ..."

"దాంతో మొదలైంది గొడవ. మొన్ననే పోయి వచ్చావు కదా. మళ్ళీ అప్పుడే పోకపోతే నేం? - పోయినప్పు డల్లా వంద ఖర్చు - నెలకు రెండు సార్లు పోతే రెండొందలు - ఇలా అయితే సంసారం గడిచినట్టే! పిల్లల గతేం కావా లనుకున్నావ్? ఇప్పట్నించే పైసా పైసా కూడబెట్టకపోతే రేపు వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు ఊరికినే అవుతాయా - అంటూ గొడవ చేసింది. ఈ ఖర్చు ఎప్పటికీ

పెట్టబోతున్నానా విశ్వం? ఏదో ఆయన ఆరోగ్యం సరిగా లేదు. మంచానపడ్డాడు కనుక ఒకటికి రెండు సార్లు పోయి రావాల్సి వస్తున్నది. దానికే నంసారం గుల్లవుతుందా? మరి అవుతున్న ఇతర ఖర్చుల మాటేవిటి? నా తండ్రిని చూసి రావడానికి వెళ్తే అది అనవసరపు ఖర్చా? నిజానికి ఈ వృద్ధాప్యంలో ఆయన్ని దగ్గ రుండి చూసుకోవాలి - కాని చూడటానికి వెళ్తాను అన్నందుకే గయ్యాళిలా అరుస్తున్నదే. రేపు ఇంటికి తీసుకొస్తే ఊరుకుంటుందా? అసలే ఇల్లు ఇరుకు అని గొడవ చేస్తుంది. ఏదో మాట అని ఆయన మనసు విరగ్గొడుతుంది. అభిమానం చంపుకోలేక వెళ్ళిపోతాడు. నన్ను చదివించి, ఒక ఆఫీసు ఉద్యోగిని చేయడానికి మా నాన్న ఎంత శ్రమ పడ్డాడో ఆమె అర్థం చేసుకోదేం. కడుపు కట్టుకొని కూలి నాలి చేసి ఒక పూట తిని, ఒక పూట పస్తుండి నన్ను చదివించాడు విశ్వం మా నాన్న. ఇప్పుడు ఆయనకు ఓ వంద రూపాయలు చేతిలో పెడదా మంటే భయం - సంసారం గంగలో కలిసిపోతుందట!"

వింటున్న విశ్వం గుండె వేగంగా కొట్టుకోసాగింది. రాఘవరావు భార్య మంగగారి ప్రవర్తన గురించి వింటుంటే తన భార్య ఉమామహేశ్వరి ఉరిమి చూసే గుడ్లతో, ఈసడింపు మొహంతో అతని కళ్ళలో కనిపించింది.

"ఆ ముసల్దాన్ని ఇక్కడి కెందుకు తీసుకొచ్చావ్? ఖళ్ళు ఖళ్ళున దగ్గుతుంటే మనకు ని ద్రెలా పడుతుంది? ఇంటి ఓనరు ఊరుకుంటాడా? వెంటనే ఇల్లు ఖాళీ చేయమనడూ?" అని అరుస్తున్నట్టు అతని చెవులకు వినిపించింది.

అనారోగ్యంగా ఉన్న తన తల్లిని నిన్ననే ఊరి నుంచి తీసుకొచ్చాడు. డాక్టరుకు చూపిస్తే టీ.బీ. అని తేలింది. ఎక్స్‌రే తీయాలి. మంచి మందులు వాడాలి. మంచి ఆహారం ఇవ్వాలి. డాక్టర్ ఫీజు పోను రెండు వేలు కావాలి. ఉన్న పళంగా తనకు అంత డబ్బు ఇచ్చే దెవరు? ఇప్పటికే ఆలస్యమైంది - పరిస్థితి విషమిస్తూందని డాక్టర్ వార్నింగ్ కూడా ఇచ్చాడు. అందుకే డబ్బు ప్రయత్నంలో ఉన్నాడు విశ్వం. ఆఫీసులో అంత అప్పు ఇవ్వ గలిగే వారు లేరు. అతనూ అడగలేదు.

ఏదైనా బాంకులో తాకట్టు పెడదా మని వచ్చేప్పుడు భార్య గొలుసు తెచ్చాడు. ఆ వివరాలు కనుక్కుపోదామని రాఘవరావు దగ్గరికి వస్తే ఆయన పరిస్థితి ఇది!

కాని రాఘవరావు మాటలు విన్న తరువాత భార్య గొలుసు ముట్టుకుంటే ఎంత ప్రమాదమో అర్థమవసాగింది విశ్వానికి. ఆమెకు తెలియకుండా పెట్టె లోంచి గొలుసు తీసి చేతి బాగ్‌లో వేసుకొని వచ్చేశాడు.

ఆ రోజు శుక్రవారం. తలస్నానం చేసే ముందు గొలుసు తీసి పెట్టెలో దాచింది. అప్పు గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న విశ్వానికి గొలుసు సంగతి గుర్తు కొచ్చింది. ఆమెకు చెప్పే తీసుకొద్దాం అనుకున్నాడు. కాని, ఆఫీసు హడావిడిలో వీలుపడలేదు. తరువాత చెప్పవచ్చులే అనుకున్నాడు.

ఆ 'తరువాత చెప్ప వచ్చు-' ఎంత ప్రమాదమో ఇప్పు డర్థ మయింది విశ్వానికి. ఇంటికి వెళ్ళ గానే - "నా గొలు సేం చేశారు?" అని గట్టిగా అడిగిందో తల్లి అర్థం చేసుకుంటుంది. మనసులో బాధ పెట్టుకుంటుంది - ఏ మందులైనా ఇంకేం పనిచేస్తాయ్?

"ఇక ఆ గొలుసు మళ్ళీ చేతి కొచ్చినట్టే!" అని వెటకారం.

"ఎక్కడి కన్నా పోవాలంటే బోసి మెడతో పోడానికి సిగ్గుతో చస్తున్నాను."

ఇలాంటి మాటలు తల్లి జబ్బు గుండెకు శూలాల్లా గుచ్చుకోవూ?

విశ్వం విలవిల్లాడిపోయాడు.

"విశ్వం!"

ఉలిక్కిపడి చూశాడు విశ్వం.

"కాఫీ చల్లారిపోతోంది - తీసుకో" -'అన్నాడు రాఘవరావు.

వన్ బై టూ చేసుకొని ఇద్దరూ తాగారు.

"వెనకటి రోజుల్లో అత్త మావలను చూసి కోడలు భయపడేది. ఇప్పుడు కోడల్ని చూసి అత్త మావలు భయపడుతున్నారు. ముఖ్యంగా ఈ చదువుకున్న ఆడవాళ్ళు అత్తమావలను మరీ గడ్డిపోచల కింద తీసిపడేస్తారేం?" అంటూ వాపోయాడు రాఘవరావు.

మౌనంగా వింటున్నాడు విశ్వం. తనకు చెప్పుకొని కనీసం రాఘవరా వన్నా ఊరట పొందనీ అనుకుంటున్నాడు.

"ఈ కోడలూ ఒకనాడు అత్త అవుతుంది కదా."

రాఘవరావు మాటల్ని వింటూ విశ్వం తన పరిస్థితిని తలపోస్తున్నాడు. తల్లిని ఊరి నుంచి తీసుకొస్తానని చెప్పినపుడు ఉమామహేశ్వరి మొహం ఎలా ఉందా అని గుర్తు చేసుకుంటున్నాడు. అస్పష్టంగా ఏదో గొణిగినట్లు గుర్తు. మొహం చిట్లించి చూసిందేమో - తాను గమనించ లేదు.

రాఘవ అన్నట్లు నేటి కోడలు తాను కూడా ఒకనాడు అత్త అవుతుందన్న విషయాన్ని మరచిపోతున్నది!

కాకపోతే ఏవిటి? రెండు సార్లు తండ్రిని చూడటానికి పోయి వస్తే రెండొందలు ఖర్చట. దాంతో సంసారం గంగలో కలుస్తుందట. పిల్లల కెట్లా నట. ఆ బాధ్యత తమది మాత్రమే అయినట్లు మాట్లాడ్తారు నేటి కోడళ్ళు.

మరోసారి ఉమామహేశ్వరి విశ్వం కళ్ళలో మెదిలింది.

పెళ్ళయిన కొత్తలో అలా కళ్ళలో కనిపించినపుడు ఒళ్ళు పులకరించిపోయేది. గుండెలో ఆనందపు లహరులు లేచి చూపులు మాటి మాటికి అసహనంగా గడియారం వంక చూసేవి. అకస్మాత్తుగా ఆఫీసుకు హాలిడే డిక్లేర్ చేస్తే బాగుండు ననిపించేది. అక్కడికీ ఆ ఏటి సెలవు లన్నీ ఆ నెలలోనే ఖర్చు చేశాడు. ఆఫీసు ఫాను గాలి వేడిగా ఉండేది. ఫైళ్ళలో పెద్ద సైజు తేళ్ళు, జెర్రులు పాకేవి. కలం చేతికి ఎంతో బరువై పోయేది!

కాని ఇవ్వాళ... ఈ గొలుసు వ్యవహారం తరువాత... ఉమామహేశ్వరి కళ్ళలో కనిపిస్తే ఆత్రేయ విషాద గీతాలు విశ్వం గుండెలో ప్రతిధ్వనిస్తున్నాయి - ముఖ్యంగా తన కన్న తల్లిని ఆమె ఈసడించుకుంటుంది అని తలచుకున్నప్పు డల్లా ఆమె సంపెంగ ముక్కు కాని, నాజూకు ఒళ్ళు కాని అందంగా కనిపించడం లేదు.

"వెళ్దామా విశ్వం!-"

"అఁ... పద."

లేచి నిల్చున్నాడు విశ్వం. రాఘవరావు వెంట తిరిగి ఆఫీసు హాలుకు వచ్చేశాడు. కుర్చీలో కూర్చున్నాడు.

ఫాను గాలి తగులుతున్నా విశ్వానికి ఉక్కపోతగానే ఉంది. మొహం తుడుచుకొని తుడుచుకొని కర్చీఫ్ తడిసి ముద్దయింది. ముక్క వాసన కూడా వేస్తున్నది.

ఛాతీ మీది బటన్ తీయడం విశ్వానికి ఇష్టం ఉండదు. కాని ఆ రోజు తప్పలేదు. బటన్ విప్పి అప్పుడప్పుడు ఛాతీ మీదికి గాలి ఊదుకోసాగాడు.

వాతావరణం మరీ అంత వేడిగా లేదు - విశ్వం ఆలోచనలు వేడిగా ఉన్నాయి. అతని మనసు ఆందోళనగా ఉంది. అతను కూర్చున్న కుర్చీకి



ముళ్ళు మొలిచాయి. అతని కళ్ళద్దాలు భూతద్దాలై ఫైళ్ళ కట్టలను గుట్టల్ని చేసి చూపిస్తున్నాయి.

చేతి బాగు వంక చూశాడు. భార్య గొలుసు ఉన్న ఆ బాగు పాము బుట్టలా కనిపించింది.

ఇంకా నయం, బాంకులో తాకట్టు పెట్టాడు కాదు - ఇంటి బతుకు కూడా నరకమైపోయేది. రాఘవ తన భార్య గయ్యాళితనం గురించి చెప్పి గొప్ప మేలు చేశాడు.

తాను ఆఫీసుకు వచ్చిన తరువాత ఉమ గొలుసు కోసం పెట్టె తెరిచి చూసిం దేమో! ఎన్నెన్ని మాట లంటున్నదో!

చేతి బాగు - చేతి బాంబున్న బాగ్‌లా కనిపించసాగింది.

ఆ ముళ్ళ కుర్చీ మీద... ఆందోళనను మోస్తూ ఇక కూర్చోలేక పోయాడు విశ్వం.

నగం రోజు సెలవు పెట్టి ఇంటి ముఖం పట్టాడు.

బస్సులో కూర్చున్నా డన్న మాటే గాని మనో వేగం ముందు ఆ బస్సు వేగ మెంత? భార్య గొలుసు కోసం పెట్టె తెరిచి చూసినట్లు... కనిపించక పోయేసరికి శోకాలే మొదలుపెట్టిందో... శ్లోకాలే మొదలుపెట్టిందో...

"ఇంట్లోకి కొత్తగా వచ్చిన వా ళ్ళెవరున్నారు?" అని ఆరాలే మొదలుపెట్టిందో...

ఆ గదిలోనే ఉన్న అమ్మ ఆ మాటలు విని-" అమ్మా... నే నట్లాంటి దాన్ని కా దమ్మా..." అని దీనంగా అంటున్నది. గుడ్ల నిండా నీళ్ళు కుక్కుకుంటున్నది.

విశ్వం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఎంత తప్పు చేశాడు! ఉమకు ఒక్క మాట చెబితే పోయేది. ఆమె వద్దు అంటే ఊరుకునేవాడు. అయినా ఆమెకు చెప్పొద్దు అని తాను అనుకోలేదు. బస్సు తొందరలో, ఆఫీసు హడావిడిలో వచ్చేశాడు.

ఉమ మాటలు పడలేక అమ్మ ఇప్పటికే ఊరు బస్సును వెదుక్కుంటూ బస్సు స్టేషన్లోనే ఉందో, రైలు స్టేషనుకు వెళ్ళే దారిలోనే ఉందో.


బస్సు వేగంగా పోతున్నది - కాని మెల్లగా



నడుస్తున్నట్టు అనిపిస్తున్నది విశ్వానికి. ఏమైంది ఈ డ్రైవర్‌కు? తా నే డ్రైవర్ సీట్లో కూర్చొని వేగంగా బస్సు తోలాలి అన్నంత తొందర. ఆటోలో పోయినా బాగుండేది. కండక్టర్ పాత వాడే. రోజూ మంచి వాడిలాగే కనిపించేవాడు. కాని ఆ రోజు... ఆ క్షణంలో యమకింకరునిలా... ఎమర్జెన్సీ కాలంలోని పోలీసు బంట్రోతులా కనిపిస్తున్నాడు. అడుగడుగునా అతనే కదా బస్సును ఆపే దని విశ్వానికి కోపంగా ఉంది. టికెట్ ఇష్యూయింగ్ పాయింట్లు పెట్టిన వా డెవడో కనుక్కొని వాడి డొక్కలో తన్నా లన్నంత కోపంగా ఉంది - సడెన్ బస్సు ఆగింది.

టికెట్ చెకింగ్.

విశ్వం అరికాలి మంట నెత్తి కెక్కింది. ఆ కాకీ దుస్తుల వాడి కాలర్ పట్టుకొని ఎడా పెడా వాయించా లనిపించింది. ఆ ఒక్క రోజు... ఆ ఒక్క




బస్సును వదిలితే వాడి బాబు సొ మ్మేం పోయింది?

తొందర పనుల మీద వెళ్ళే జనం కూర్చున్న బస్సేదో ఈ చెకింగ్ వాళ్ళు ఇట్టే పసిగట్టేస్తారు.

తృప్తిగా కట్నం తీసుకొని, కోడి పలావ్ భోజనం చేసి పళ్ళలో ఇరికిన వాటి తాలూకు అవశేషాలను తీరిగ్గా పుల్లతో తొలగించుకునే పండుగ అల్లుడిలా... ఆ చెకింగ్ వాడు ఎంత మెల్లగా, నాజూగ్గా చూస్తున్నాడు టికెట్లని!

దిగి ఆటోలో వెళ్తే? కిటికీ లోంచి చూశాడు - ఆ ప్రాంతంలో ఆటో కాదు గదా - రిక్షా కూడా దొరకదు. అది ఏ చౌరస్తా కాదు. ఏదో ఆటో ఖాళీగా తన కోసం అటువేపు ఎందుకు వస్తుంది? పావు గంట నడిస్తే కాని ఆటోలు దొరికే చౌరస్తా రాదు.

హత్య చేసే దృశ్య మున్న సినిమా చూడటానికే ఇష్టపడని విశ్వానికి ఆ క్షణంలో కాకీ దుస్తుల ఇన్‌స్పెక్టరును హత్య చేయా లన్నంత కోపం వచ్చింది.

ఒడిలోని చేతి బాగు పాకిస్తాన్ తయారు చేస్తున్న అణు బాంబులా కనిపించింది.

"చలో బాయ్... పోనియ్య వయ్యా బస్సు... పోనియ్... డ్రైవర్ పోనియ్ ప్లీజ్... అందరి దగ్గర టికె ట్లున్నాయి."

మరో అరగంట సేపు విశ్వం మనసును వేధించి... వేధించి ఆ బస్సు ఓ సారా దుకాణం ముందు ఆగింది. అంటే దరిదాపుల్లో ఆర్టీసి స్టాప్ ఉందన్న మాట!

పరుగు లాంటి నడకతో విశ్వం ఇల్లు చేరుకున్నాడు. పరుగు లాంటి నడక పందాలు గనుక ఉంటే ఆ క్షణంలో విశ్వం విశ్వానికే ఫస్ట్ వచ్చేవాడు.

భార్య వాకిట్లో ఎదురు కాలేదు. హమ్మయ్య! శుభ సూచకం అనుకున్నాడు.

అమ్మ వసారాలో పడుకొని ఉంది.

మనస్సుకు శాంతి కలిగింది.

'అమ్మా'! అని ఆమెను లేప లేదు. 'ఉమా' అని కేక వేయ లేదు. అసలు అలవాటు ప్రకారం కాళ్ళైనా కడుక్కో లేదు. చెప్పులు విడిచి సరాసరి బెడ్ రూముకు నడిచాడు.

నడిచాడా, బెడ్ రూములోకి ఉరికాడు. ఆత్రంగా చేతి బాగ్ తెరిచాడు...

అందులో-

పాకిస్తాన్ అణు బాంబు లేదు-

పాము లేదు-

ఉమ గొలుసు లేదు!

నిలువునా నిర్ఘాంతపోయాడు విశ్వం!

మరోసారి బాగ్‌లో వెదికాడు. ఆఫీసు కాగితాలు, పేరుకుపోయిన అక్కరకు రాని కాగితాలు పగలబడి నవ్వుతున్నాయి.

ముచ్చెమటలు పోశాయి విశ్వానికి.

మళ్ళీ బాగు నంతా వెదికి చూశాడు. కాగితాల్ని వెదికాడు. తీసి టేబుల్ మీద కుప్ప పెట్టాడు. ఉమ గొలు సున్న పొట్లాం కనిపించ లేదు.

బాగ్‌ను దులిపి చూశాడు.

ఎన్నిసార్లు దులిపినా ఏముంది? అ దేమన్నా పి.సి. సర్కార్ చేతి బాగా, చెప్పిన వస్తువు దూకడానికి!

ఉమ గొలుసు లేదు.

ఎక్కడ పడిపోయిందో ఏమో!

తల పట్టుకొని కుర్చీలో కూలబడిపోయాడు

విశ్వం. ముందు పాకెట్ తప్ప గొలుసున్న పాకెట్ తెరవనే లేదు కదా. మరి బాగ్ లోంచి గొలుసు ఎలా మాయమైంది? ఆఫీసులో కూడా భద్రంగా అల్మారాలో దాచాడే! రాఘవరావుతో కాంటీన్‌కు వెళ్ళినపుడు ఆల్మేరాకు తాళం కూడా వేశాడే -

ఎక్కడ పడిపోయింది?

ఎక్క డని వెదుకుతా డు?

బాంకులో తా కట్టుపెట్టి డబ్బు తెచ్చిన వాడైనా కాదు - ఇల్లాలి పోరు చవిచూస్తే చూశాడు - తల్లికి మందు లైనా తెచ్చేవాడు.

గొలుసు పోయింది అంటే ఉమ నమ్ముతుందా! రాత రాసిన బ్రహ్మను, పాలు పోసిన పోలయ్యను కలిపి తిడుతుందా?

తల్లికి మందులు కొనాలి అని డైరెక్టుగా చెప్పవచ్చుగా - అమ్మేసి గొలుసు పోయిందని బొంకుతున్నావా అని పోట్లాటకే దిగుతుందా?

గొలుసు పోయిన నష్టం భరించడానికైనా సిద్ధమే కాని ఉమ పోరును, ఆ తరువాత తల్లి పడే ఆవేదనను తలచుకుంటే అతని గుండె చెరు వవుతున్నది. కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి.

బయట అలికి డయింది.

పక్కింటావిడతో కలిసి వస్తున్నది ఉమ.

మార్నింగ్ షోకు పోయిందేమో నని మరో సారైతే విశ్వం కోపాని కున్న విశ్వరూపా లన్నీ ధరించే వాడే-

కాని ఆ రోజు మార్నింగ్ షోను అంత తొందరగా వదిలిన థియేటర్‌ను కసితీరా మనసులో తిట్టుకుంటున్నాడు - భారంగా కళ్ళు మూసుకున్నాడు.

అసలు గొలుసు పోలేదేమో - తా నే ఇంట్లో మరిచిపోయాడు కాబోలు. ఆ ఊహ ఎంతో ఊరట కలిగించింది. నరకలోకానికి నగం దూరంలోనే ఉన్న ప్రాణాలు వెనక్కు తిరిగి వచ్చేశాయ్.

హమ్మయ్య, గొలుసు ఉమ మెడలోనే ఉందేమో ఇందాక ఉమ అలికిడి విని బెదిరిపోయిన విశ్వం ఇప్పుడు ఉమ ఇంట్లో అడుగు పెట్టే క్షణాల కోసం ఎదురుచూస్తున్నాడు.

రాగానే ఆమె మెడలో గొలుసు కనిపించి తీరుతుందని అతని నమ్మకం.

కాని నమ్మకాలు నమ్మకంగా నిజాలు కావు గదా! ఉమ బోసి మెడ చూసి విశ్వం గుండె ఆగినంత పనయింది.

అంటే ఆమె ఇంకా పెట్టె తీసి చూడలేదన్న మాట! గొలుసు లేని విషయం ఆమెకు తెలియదు. ఇంట్లో అడుగు పెట్టిన భార్యకు మొహం చూపించలేక తల దించుకున్నాడు విశ్వం.

"అప్పుడే వచ్చా రేం?"

ఉమ నవ్వుతూ దగ్గరగా వచ్చింది.

"అదేలా ఉన్నారేం. ఒంట్లో బాగా లేదా?" నుదుటి మీద చేయి వేసి చూసింది.

"ఈ చెమట లేవిటి! అరెరె ఒళ్ళంతా చల్లబడిందే!" కంగారుగా ఫాన్ వేసి అతని చెమట దుస్తులు మార్చే ప్రయత్నంలో పడింది ఉమ.

ఆ బోసి మెడ... ఆ మంచి మాటల కాంబినేషన్ ఉగాది పచ్చడిని గుర్తుకు తెస్తున్నాయి.

ఆమె అనురాగానికి పొంగిపోవాలా... ఆ బోసి మెడ ఇంకాస్సేపట్లో సృష్టించబోయే తుఫానును తలచుకొని క్రుంగిపోవాలా?

"అత్తయ్యకు ఎక్స్‌రే తీయించుకొచ్చాను-"

"ఊఁ..."

"టీ.బీ. కావచ్చు అన్నారేమో డాక్టర్."

"ఆఁ..."

"రేవు సెలవు పెట్టండి. పొద్దున్నే ఎక్స్‌రే కాపీ ఇస్తానన్నారు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్దాం. అత్తయ్యకు త్వరలోనే నయమవుతుంది. మీ రేం కంగారుపడకండి."

విశ్వానికి తా నే విశ్వంలో ఉన్నాడో అర్థం కాలేదు.

"ఉమా!" ఆమె అర్థం గాక ఇంకా బెదురుగ్గానే చూస్తున్నాడు.

"ఉమా!..."

"ఊఁ... ముం దీ డ్రెస్ చేంజ్ చేసుకోండి తరువాత మాట్లాడు కుందాం."

"ఉమా..."

"ఊఁ - కాళ్ళూ చేతులూ కడుక్కొని రండి. వేడి వేడి కాఫీ తాగుతూ మాట్లాడుదురు."

"ఉమా..."

"ఊఁ...."

"ఉమా... నీ... గొ... లు... ను..."

నవ్వింది ఉమ.

ఆ నవ్వు అర్థమై అర్థం కానట్లుగా ఉంది విశ్వానికి.

నాకు తెలును నువ్వు తీసుకపోయావనా? లేక ఉందిలే పెట్టెలో అనా! ఎందు కా నవ్వు?

"అది కాదు ఉమా... నీ గొలును..."

"నా దగ్గర మీ కెందుకు దాపరికం చెప్పండి. మీ బాధ్యత నా బాధ్యత కాదా. డబ్బుకు మీ రెంత ఇబ్బంది పడుతున్నారో నాకు తెలియదా? మీరు గొలును తా కట్టు పెడితే, అమ్మితే కాదన్నానా?"

విశ్వం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"ఉమా... నీ గొలును పోయింది ఉమా. నేనే పోగొట్టాను.

"పిచ్చి శ్రీవారూ.. ఎక్కడ పోగొట్టారో చెప్పండి?"

"నిజం ఉమా. బాంకులో తా కట్టుపెడదామని తీసుకెళ్ళా . కాని ఎక్కడో పడిపోయింది."

"ఉహుఁ..." నవ్వుతోంది ఉమ.

"నిజం ఉమా."

"ఎక్కడా పడిపోలేదు. ఇంట్లో టేబుల్ మీదే ఉంది. తీసుకోబోయి నేను ఏమంటానో నని భయపడి టేబుల్ మీద వదిలి వెళ్ళారు కదూ? ఇంతేనా మీరు నన్ను అర్థం చేసుకుంది? అత్తయ్యా మీ కెంతో నా కంత కాదా? ఆమెను చూసుకునే బాధ్యత మనిద్దరిదీ కాదా? ఆమె ఆరోగ్యం బాగుపడటం కంటే మనం ఇప్పుడు కోరుకునేది ఏముంది చెప్పండి? మీరు బాంకులో గొలుసు పెట్టడానికి తటపటాయిస్తున్నారని గమనించి నేనే కామాక్షమ్మ వదినతో వెళ్ళి ప్రుడెన్షియల్ బాంక్‌లో తా కట్టు పెట్టాను."

డబ్బు, రసీదు భర్త చేతికి అందించింది ఉమ.

"ఉమా!" తన కళ్ళను... తన చెవుల్ని.. తన స్థితిని తానే నమ్మలేకపోయాడు విశ్వం.

అతని మెడ చుట్టూ అనురాగపు గొలుసును వేసి మల్లె కంటే అందంగా నవ్వింది ఉమ. *

